
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.2, కనిష్ఠం 25.4



నిజామాబాద్
జిల్లా వార్తలు

శుక్రవారం 21 జూన్ 2024





మొరం తవ్వకాలపై ఆరా!

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న క్వారీలపై నూతన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. మట్టి, మొరం తవ్వకాలపై ఆరా తీస్తోంది. గనుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాల్లో సర్వేను కొనసాగిస్తోంది. క్వారీలు తీసుకున్న అనుమతి, చేపట్టిన తవ్వకాలను క్షుణంగా పరిశీలిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు చేపట్టిన క్వారీ యజమానులపై చర్యలకు ఉపక్రమిస్తోంది.

- జిల్లాలో మొరం, మట్టి అక్రమ తవ్వకాలపై గనుల శాఖ సర్వే
- క్వారీల నిర్వహణపై నజర్
- తీసుకున్న అనుమతులు.. చేపట్టిన తవ్వకాలపై పరిశీలన
- నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన క్వారీ యజమానులపై చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు

నిజామాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలు చేపట్టిన క్వారీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. అనుమతి పొందిన విస్తీర్ణం కంటే అధనంగా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వారీల వివరాలను అధునాతన పరికరాల ద్వారా సర్వే చేస్తున్నారు. ఎంత మొత్తంలో ఎక్కువగా తవ్వకాలు చేశారు. గుర్తించడంతో పాటు దానికి అనుగుణంగా జరిమానా విధించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని క్వారీల యజమానులకు జరిమానాలు విధించగా మరికొంత మందికి అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పూర్తిస్థాయిలో సర్వే పూర్తయిన చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో అనుమతులు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో కంకర, మట్టి, మొరం తవ్వకాలకు పలు ప్రాంతాల్లో అనుమతులు ఇచ్చారు. గనుల శాఖతో పాటు రెవెన్యూ శాఖ ద్వారా అనుమతులను పొందారు. ప్రభుత్వ అవసరాలతో పాటు ప్రైవేటు అవసరాలకు కూడా అనుమతి పొందిన క్వారీల నుంచి తవ్వకాలు చేసి సరఫరా చేశారు. గత ప్రభుత్వం హయాంలో కంకర క్వారీలు పొందిన వారు పర్యావరణ అనుమతులను ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా కొన్నిచోట్ల తవ్వకాలు చేశారు. అనుమతులకు మించి ఎక్కువ మొత్తంలో తవ్వి పంపిణీ చేశారు. కోట్ల రూపాయల టాక్స్‌ను ప్రభుత్వానికి ఎగ్గొట్టారు. అనుమతులు కొంత తీసుకొని ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేయడం వల్ల చాలా ప్రాంతంలో గుట్టలు కనుమరుగయ్యాయి. మట్టి, మొరం తవ్వకాలు కూడా ఎక్కువ మొత్తంలో జరిగాయి. వీటన్నింటిపై గతంలోనే జిల్లాకు చెందిన పలు పార్టీల నేతలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇక్కడ పట్టించుకోకపోవడంతో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు హైకోర్టులోనూ కేసులను వేశారు. క్వారీలు పొందిన వారిలో ఎక్కువ మంది అప్పటి ప్రజాప్రతినిధుల బంధువులు ఉండటం వల్ల కేసుల ను నమోదు చేయలేదు.

గనుల శాఖ ఆధ్వర్యంలో సర్వే

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గనుల శాఖ అధికారులు ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. జిల్లా అధికారులు చేపడితే సరైన నివేదిక ఇవ్వరని ఉద్దేశ్యంతో ఇతర జిల్లాల అధికారులను పంపిస్తున్నారు. టీమ్‌లాగా ఏర్పాటు చేసి క్వారీలలో సర్వే నిర్వహిస్తున్నారు.

కంకర క్వారీల వివరాల సేకరణ

అధునాతన పరికరాలను ఉపయోగించి ఈ సర్వే కొనసాగిస్తున్నారు. కంకర క్వారీలకు అనుమతులు ఇచ్చిన సమయంలో ఎన్ని మీటర్ల విస్తీర్ణంలో ఇచ్చారు. ఎన్ని క్యూబిక్ మీటర్ల తవ్వకాలు చేశారు, ఎంత మేరకు పన్ను కట్టారు వంటి వివరాలను తీసుకుంటున్నారు. జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎంత మొత్తంలో నిబంధనలు ఉల్లంఘించి అనుమతి ఇచ్చిన దానికంటే ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేశారు. వివరాలను సేకరిస్తున్నారు. క్వారీల ఆధారంగా నివేదికలను రూపొందిస్తున్నారు. కంకర క్వారీలకు అనుమతి ఇచ్చిన సమయంలో పర్యావరణ అనుమతులను పరిశీలించడంతో పాటు అక్రమంగా ఎన్ని కోట్ల విలువైన కంకర తవ్వకాలు చేశారో నివేదికలు రూపొందిస్తున్నారు. ఈ నివేదిక ఆధారంగా అనుమతులు పొంది అంతకుమించి తవ్వకాలు చేసిన వారిపై ఎక్కువ మొత్తంలో జరిమానా విధించడంతో పాటు అవసరమైతే కేసులను కూడా నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో నమోదైన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను కూడా పరిశీలిస్తున్నారు. పూర్తిస్థాయిలో సర్వేను కొనసాగిస్తున్నారు. క్వారీలే కాకుండా జిల్లా వ్యాప్తంగా మట్టి, మొరం తవ్వకాలపైన కూడా వివరాలను తీసుకుంటున్నారు. అనుమతులు ఎన్ని తీసుకున్నారు, ఎంత మొత్తంలో తవ్వకాలు చేశారు. ఎంత మొత్తం ఎక్కువగా తవ్వారో వివరాలన్నీ గతంలో కూడా తీసుకున్న అధికారులు కొంత మందికి జరిమానాలు కూడా విధించారు. మట్టి, మొరం ఎక్కువగా ఇండ్లతో పాటు వెంచర్లకు, రోడ్లకు వినియోగిస్తున్నారు. రోడ్లకు కొన్ని చోట్ల అనుమతులు తీసుకున్న అంతకుమించి తవ్వకాలు చేయడం వల్ల వారికి కూడా కొంత మేర ఇప్పటికే జరిమానాలు విధించారు. కొన్ని కంపెనీలకు కోటి రూపాయలకు పైనా ఫైన్ వేశారు. వాటిపైన కూడా ఈ సర్వేలు కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా క్వారీలు, మట్టి, మొరం తవ్వకాలపై సర్వే కొనసాగుతుందని ఏడీ విజయ్‌కుమార్ తెలిపారు. పూర్తిస్థాయిలో సర్వే పూర్తయిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో ఓడినా..
జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- పార్లమెంట్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ పిలుపు

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్‌లో ఓడినప్పటికీ జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలు అన్నారు. గురువారం నగరంలోని లక్ష్మీకల్యాణ మండపంలో నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మత విద్వేశాలు రెచ్చగొట్టి గెలిచిందని బీజేపీ, బీఆర్‌ఎస్‌ల చీకటి ఒప్పందం వల్లే కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 శాతం ఓట్లు బీఆర్‌ఎస్‌కు వస్తే నిజామాబాద్ పార్లమెంట్‌లో కేవలం 9 శాతం ఓట్లను మాత్రమే సాధించారని బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీతో కుమ్మక్కు కావడం వల్లే కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. బీజేపీ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచిన మాట వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గడువులోగా ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని, నిజామాబాద్ నగరాన్ని స్మార్ట్ సిటీగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా ప్రతి ఒక్కరు పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు ఇచ్చి వారిని గెలిపించుకునే బాధ్యత తమపై ఉందని నాయకులు అన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, నియోజకవర్గ కోఆర్డినేటర్లు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, నాయకులు గడుగు గంగాధర్, పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు

'ధరణి' దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

డిచ్‌పల్లి, జూన్ 20: పెండింగ్‌లో ఉన్న 'ధరణి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు ఆపరేటర్లను వివరాలు అడిగి తెలుసుకు న్నారు. 'ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి' అని ఆరా తీశారు. పెండింగ్‌లోని దరఖాస్తులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్, అవసరమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన తర్వాత పరిష్కరించాలన్నారు. ఆయా గ్రామాల వారీగా దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటి పరిష్కారంలో తాత్సారం లేకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోపు ధరణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు సంతోష్, ప్రభురాజ్, సిబ్బంది ఉన్నారు.



పశుసంవర్ధక శాఖ అధికారుల్లో గుబులు!

- రాష్ట్రస్థాయిలో గొర్రెల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ అధికారుల నిర్ధారణ
- ఏసీబీ, విజిలెన్స్ దర్యాప్తుతో వివరాలు సేకరిస్తున్న అధికారులు
- జిల్లాలోనూ గొర్రెల పంపిణీపై క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన
- జిల్లా అధికారుల్లో మొదలైన ఆందోళన

నిజామాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గొర్రెల పంపిణీ పథకంలో కొన్ని జిల్లాల్లో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించడంతో జిల్లా అధికారుల్లో గుబులు మొదలైంది. రంగారెడ్డితో పాటు ఇతర జిల్లాల్లో గొర్రెల పంపిణీ యూనిట్లలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. గొర్రెలు, మేకల ఫెడరేషన్ అధికారులతో పాటు కీలకమైన పశుసంవర్ధక శాఖకు చెందిన కొంత మంది అధికారులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్‌తో పాటు ఏసీబీ అధికారులు అవకతవకలపై దర్యాప్తును కొనసాగిస్తున్నారు. గొర్రెల పంపిణీ పథకంలో కొన్ని యూనిట్లు పంపిణీ చేయకుండానే ఎత్తివేసినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. ఇతర జిల్లాల్లో వివరాలను కూడా సేకరిస్తున్నారు. రాష్ట్ర ఏసీబీ అధికారుల సూచనల మేరకు అన్ని జిల్లాల నుంచి వివరాలను కోరడంతో జిల్లా అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోనూ తీగ లాగుతున్నారు. పంపిణీ చేసిన లబ్ధిదారుని వివరాలను తీసుకుంటూ మండలాల వారీగా నివేదికలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో మొదటి, రెండో విడతలో పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల తాజా పరిస్థితులను కూడా ఆ నివేదికలో పొందుపరుస్తున్నారు. అసలైన లబ్ధిదారులకు అందించారా ? అనే వివరాలను పరిశీలిస్తూనే పూర్తిస్థాయి నివేదికను ఆ శాఖ ఉన్నతాధికారులకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏడేళ్ల తర్వాత వివరాల సేకరణ

ఏడేళ్ల తర్వాత వివరాలను సేకరిస్తుండటంతో లబ్ధిపొందిన వారు మినహా యూనిట్ల రీసైక్లింగ్‌కు పాల్పడిన వారిలో ఆందోళన కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివరాలను తీసుకుంటుండటంతో యూనిట్ల పంపిణీ సమయంలో కీలకంగా వ్యవహరించిన ప్రజాప్రతినిధులు ఇప్పటి నేతలను కలుస్తున్నారు. తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

గొర్రెల కొనుగోళ్లలో పక్కదారి పట్టిన డబ్బులు

ఈ యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక, గొర్రెల కొనుగోళ్లలో ఎక్కువ మొత్తంలో డబ్బులు పక్కదారి పట్టినట్లు, లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఇతర జిల్లాలో ఏసీబీ అధికారులు గుర్తించారు. కొన్ని చోట్ల కొన్న యూనిట్లనే రీసైక్లింగ్ చేసి ఇతర లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో ఆ వివరాలన్నీ సేకరిస్తున్నారు. జిల్లాలో కూడా మొదటి విడతలో పెద్ద ఎత్తున పంపిణీ చేయడంతో 33 మండలాల నుంచి వివరాలను పశుసంవర్ధక శాఖ అధికారులు సేకరిస్తున్నారు. మండలం వారీగా గొర్రెల పంపిణీ యూనిట్ల వివరాలను నివేదిక రూపంలో తయారు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు ఎన్ని పంపిణీ చేశారో వివరాలను ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల వివరాలను అందులో పొందుపరుస్తున్నారు. గొర్రెలు పొందిన లబ్ధిదారుల వద్ద గొర్రెలు లేకుండా ఉంటే అవి ఏమి చేశారో మండలాల వారీగా వివరాలను తీసుకున్నారు. మండల పరిధిలో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ వివరాలను తీసుకోవడంతో పాటు జిల్లా అధికారులకు పంపిస్తున్నారు. జిల్లా నుంచి పూర్తి నివేదికను గొర్రెలు, మేకల ఫెడరేషన్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా అధికారులు లబ్ధిదారుల నుంచి మరిన్ని వివరాలను అడిగితే పొందుపరిచేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు చేసే సమయంలో జరిగిన గోల్‌మాల్‌పైనే ఎక్కువగా ఏసీబీ అధికారులు నజర్ పెట్టడంతో జిల్లా స్థాయిలో ఆ సమయంలో పంపిణీలో ముఖ్యపాత్ర పోషించిన కొంతమంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల్లో ఆందోళన కనిపిస్తుంది. ఈ వ్యవహారంలో ఏదైనా బయటకి వస్తే తమకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ముందస్తుగానే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలుస్తూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో గొర్రెల పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల ఆధారంగా వివరాలను సేకరించి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆ శాఖ జేడీ డాక్టర్ జగన్నాథచారి తెలిపారు. పూర్తిస్థాయిలో నివేదికను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. డీడీలు కట్టిన వారికి తిరిగి వాపసు ఇస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.



ఆబ్కారీలో ఆరేళ్లుగా బదిలీలు లేవు

సుభాష్‌నగర్, జూన్ 20: ఆబ్కారి శాఖలో ఆరేళ్లుగా బదిలీల ప్రక్రియ జరగలేదు. ఎక్సైజ్ శాఖలో ప్రతి మూడేళ్లకు ఒకసారి బదిలీలు చేపట్టాల్సి ఉండగా ఆరేళ్ల గడిచిపోయినా బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం లో ఉండగా కేవలం ఒకేసారి బదిలీ ప్రక్రియను చేపట్టింది. దీంతో బదిలీల కోసం అధికారుల ఎదురు చూస్తున్నారు.

త్వరలో బదిలీలకు అవకాశం

రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో బదిలీలు చేపట్టే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖలో చర్చించుకుంటున్నారు. దీంతో ఉద్యోగులు పైరవీల కోసం ఉన్నతాధికారులను, రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. పైరవీలతో మంచి స్థానాన్ని పొందేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆరేళ్లుగా ఒకేచోట ఉండటంతో బదిలీల్లో అనుకూలమైన స్థానాన్ని పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే ఇప్పటికే మంచి స్థానాల్లో ఉన్న ఉద్యోగులు ఆ స్థానాన్ని వదిలిపెట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ఎక్సైజ్ శాఖ అనగానే కాసుల పంటగా ఉండటంతో కొందరు ఆ స్థానాన్ని వదిలిపెట్టేందుకు ఇష్టపడటం లేదు. మరికొందరు బదిలీ అయితే మంచిస్థానాన్ని పొందవచ్చని బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు ఆరేళ్లుగా మారుమూల ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ బదిలీల కోసం వేచి చూస్తున్నారు. ఎక్సైజ్ శాఖకు ప్రిన్సిపల్ సెక్రెటరీ కొన్ని రోజుల క్రితం పదవీవిరమణ పొందడంతో కొంత కాలంగా ప్రిన్సిపల్ సెక్రెటరీగా కొత్తవారిని నియమించలేదు. దీంతో బదిలీల ప్రక్రియ కొద్దిగా ఆలస్యం కానుంది. కొత్త ప్రిన్సిపల్ సెక్రెటరీ నియామకం కాగానే బదిలీ ప్రక్రియ కానుందని ప్రచారం కొనసాగుతోంది.

- బదిలీల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులు

బదిలీలను వెంటనే చేపట్టాలి..

: రవి, ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్



ఆరేళ్లుగా ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ జరగలేదు. మూడు సంవత్సరాలకు ఒకసారి బదిలీల ప్రక్రియ జరగాల్సి ఉండగా ఆరు సంవత్సరాలు గడుస్తున్నా బదిలీలు జరగలేదు. త్వరగా బదిలీలు చేపట్టాలి. కొందరు ఉద్యోగులు ఒకేచోట ఆరేళ్లుగా పనిచేయడంతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి.

జిల్లాలో 82 మంది కానిస్టేబుల్స్ 31 మంది హెడ్‌కానిస్టేబుల్స్

ఆబ్కారి శాఖలో ఆరేళ్లుగా బదిలీలు లేకపోవడంతో ప్రస్తుతం బదిలీ ప్రక్రియ ఉండే అవకాశం ఉంది. దీంతో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్స్, హెడ్‌కానిస్టేబుల్స్, ఆఫీస్ కార్యాలయ సిబ్బందికి బదిలీలు అయ్యే అవకాశం ఉంది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 82 మంది కానిస్టేబుల్స్, 31 మంది హెడ్‌కానిస్టేబుల్స్ వివిధ ప్రాంతాల్లో గత ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి బదిలీలు అయ్యే అవకాశం ఉంది. వీరితో పాటు ఆఫీస్ కార్యాలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ స్థాయి ఉద్యోగులకు బదిలీలు చేయనున్నారు. బదిలీ ప్రక్రియ కోసం ఇప్పటికే జిల్లా స్థాయి ఉన్నతాధికారులు బదిలీ చేపట్టడానికి అవసరమైన డాటాను సేకరిస్తున్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పెద్దబజార్, జూన్ 20: నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ కార్యాలయంలో గురువారం కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డీజీఎస్ ఎంవీ రమేష్ మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ఎస్ బీఐ ఉద్యోగులు నేటి సమాజానికి ఆదర్శంగా నిలవడం జరిగిందన్నారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ బీఐ సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్, గురునాథ్, ఆర్‌ఎస్ శ్రీనివాస్, అర్విందలతో పాటు వివిధ శాఖల లోకల్ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పెద్దబజార్, జూన్ 20: నీట్‌పరీక్ష లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నీట్‌పరీక్షను ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని ప్రధానంగా ఆయా రాష్ట్రప్రభుత్వాలు పేపర్ లీకేజీ, ఇతర అవకతవకలకు పాల్పడుతున్నాయని అన్నారు. 2019 నుంచి దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష విధానాన్ని రూపొందించి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం 24లక్షలకు పైగా విద్యార్థులు నీట్‌పరీక్ష రాయడం జరిగిందని ఈ పరీక్షలకు బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో ఒక్కొక్క విద్యార్థి దగ్గర 30 నుంచి 40లక్షల రూపాయల వరకు వసూలు చేసి పేపర్ లీకేజీకి పాల్పడటం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించి నీట్ పరీక్ష అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, వెంకటేశ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్, మహేష్, కటారి రాములు, సూరి, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ డీవీ కృష్ణ స్మారకస్థూపం ఆవిష్కరణ

బోధన్‌రూరల్,జూన్20: మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన కామ్రేడ్ డీవీ కృష్ణ రెండోవర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నార. కార్యక్రమాన్ని గ్రామస్థులతో పాటు విప్లవ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజాపంథా బోధన్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. గురువారం పెంటాఖుర్దు గ్రామంలో విప్లవ ఉద్యమ నేత శ్రామికవర్గ యోధుడు డీవీ కృష్ణ కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. నిరుపేదల కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పడాల శంకర్, సహాయ కార్యదర్శి సుల్తాన్ సాయిలున్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్


అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆయా పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈనెల 24 నుంచి 29 వరకు జరుగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షతో పాటు ఈనెల 30 నుంచి జూలై 4 వరకు జరుగనున్న డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ నియామక రాత పరీక్షను పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న నిర్వహించనున్న నీట్ పీజీ ఎగ్జామ్ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతూ పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నియామక రాత పరీక్షలలో నిర్ణీత తేదీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు, మధ్యాహ్నం 2.30ల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షలు కొనసాగుతాయని, నీట్ పీజీ ఎగ్జామ్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు.

కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య

ఖిల్లా, ,జూన్ 20 : కడుపు నొప్పి భరించలేక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం మూడోటౌన్ పరిధిలోని అయ్యప్ప టెంపుల్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరానికి చెందిన గొండల రాహుల్ (28) ఎంబీఏ చేసి అయ్యప్ప టెంపుల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటినిర్మాణ పనులు చూసుకుంటున్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు వృత్తిరీత్యా మహబూబ్‌నగర్‌లో ఉంటున్నాడు. ఇంటినిర్మాణ పనులు జరుగుతుండడంతో అప్పుడప్పుడు వచ్చి చూసుకుని వెళ్తుంటాడు. రాహుల్‌కు గతంలో కూడా కడుపునొప్పి వచ్చేదని చికిత్స చేయించిన అనంతరం తగ్గిందని, తిరిగి కడుపునొప్పి రావడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లినట్లు మృతుడి తండ్రి వేంకటేశ్వర్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పరీక్ష చేసిన వైద్యులు మృతుడికి స్కానింగ్ చేసి అపెండిసైటిస్ ఉందని చెప్పడమే కాకుండా చికిత్స చేయాలని సూచించారని తెలిపారు.

జిల్లా జైలులోని ఖైదీలకు వైద్య పరీక్షలు


ఖైదీలకు టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిజామాబాద్ రూరల్, జూన్ 20: జిల్లా కేంద్రంలోని సారంగపూర్‌లోని జిల్లా జైలులో శిక్షననుభవిస్తున్న ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలోని వైద్య బృందం జిల్లా జైలుకు చేరుకున్నారు. జైలు సూపరిటెండెంట్ జి.ప్రమోద్ కు మార్ పర్యవేక్షణలో వైద్యబృందం ఖైదీలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సురక్షిత లైంగిక పద్ధతులు పాటించకపోవడం వల్ల వచ్చే ఎయిడ్స్ వ్యాధిని వివరించారు. ఎయిడ్స్ పక్కా ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు వస్తుంటే డాక్టర్‌తో పరీక్షించుకోవాలన్నారు. ఖైదీలకు టీబీ స్కీనింగ్, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించామన్నారు. టీబీ లక్షణాలు కనపడిన 19 మంది ఖైదీల శాంపిల్స్ సేకరించినట్లు వైద్యాధికారులు తెలిపారు. జైలులో మొత్తం 411 మంది ఖైదీలున్నారని వీరందరికీ పరీక్షలు నిర్వహించేందుకు మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారని జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్ కుమార్‌తోపాటు జైలర్ రాజశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్, జిల్లా టీబీ కంట్రోలర్ అధికారి సంతోష్, జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయకుమార్, జైలు ఫార్మాసిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం'

బోధన్‌రూరల్,జూన్20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల చట్టాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని వికలాంగులకు పించన్ పెంచకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని వికలాంగుల హక్కుల జాతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బస్వరాజ్ పాటిల్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌లో వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చినహామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సహ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు న్యాయంచేయాలని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం పించన్ పెంచాలని లేనియెడల రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామన్నారు. బోధన్ పట్టణంలో జులై 31న వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో 3వ జిల్లా మహసభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులుతోపాటు ప్రముఖులు రానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏశాల గంగాధర్, జిల్లా నాయకులు నాజీర్, రాములు, గోపాల్, ఎల్లయ్య, సావిత్రి, బీరప్ప, అమీనా, రాజు, గంగారాం పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేసుకోవాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్

ఆర్మూర్‌రూరల్, జూన్20: 19 ఏండ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేసుకోవాలని ఆర్మూర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పిల్లలు మట్టిలో ఆడిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పెరిగిన వేలి గోర్లను వెంట వెంటనే కత్తిరించుకోవాలని, లేని పక్షంలో వీటి ద్వారా మనం ఆహారం తీసుకునే సమయంలో మట్టి కడుపులోకి వెళ్ళి నులి పురుగులను తయారు చేసే అవకాశం ఉంటుందన్నారు. నులి పురుగులు కడుపులో ఉండడం వల్ల తరుచుగా కడుపునొప్పి రావడంతో పాటు రక్తహీనత ఏర్పడుతుంన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సాయి, వైద్యసిబ్బంది జక్కుల మోహన్, శ్యామల, స్రవంతి, మమత, సుభద్ర, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలురకు గాయపర్చిన ట్రాక్టర్ డ్రైవర్‌కు మూడునెలల జైలు

ఎడపల్లి, జూన్ 20: 2017వ సంవత్సరంలో ఏపి 25 ఏఫ్ 6466, ట్రాలీ ఏపి 01 జీ 5823 ట్రాక్టర్‌తో సైకిల్‌పై వెలుతున్న ఇద్దరు యువకులను ఢీ కొట్టి గాయ పర్చగా కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. సాక్ష్యాదారాలను పరిశీలించిన అనంతరం అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి ఇద్దరు బాలురులను గాయపరిచినందుకు అదనపు సెషన్ జడ్జి సాయి శివ ఎడపల్లి గ్రామానికి చెందిన మరాఠి నాగరాజు తండ్రి పీరాజీ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు 3 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ, గాయపడిన వారికి 5 వేలు, 10 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని తీర్పును ఇచ్చారు.

'మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఆర్మూర్‌రూరల్, జూన్20: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల నాయకులు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనకార్మిక సంఘం ఆర్మూర్ మండల కార్యదర్శి జక్కం సుజాత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట పాత్రలు, కోడిగుడ్లు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, అన్ని బిల్లులను ప్రతీనెల 5వ తేదీలోగా చెల్లించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఇలాంటిపరిస్థితుల్లో బిల్లులు రాకపోవడం సిగ్గుచేట న్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

'మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలి'

పెద్దబజార్, జూన్ 20: విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని అర్సపల్లిలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యా, వైద్య శాఖ అధికారులు విద్యార్థుల సమక్షంలో ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులను పూర్తిగా నిర్మూలించాలని అప్పుడే విద్యార్థులుల్లో ఎదుగుదల ఉంటుందని ఆరోగ్యమే మహాభాగ్యం అని ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర మేయర్ దండునీతూకిరణ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలని ఆరోగ్యంగా ఉంటేనే విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగగలుగుతారని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లాంటివి ఉంటేనే నులిపురుగులు దరిచేరవని వాటి నిర్మూలన కోసం ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర స్థాయిలో ఉచిత ఆల్బెండజోల్ మాత్రలు ప్రత్యేకంగా అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం, జిల్లా టీకాల అధికారి డాక్టర్ అశోక్, వైద్యులు సామ్రాట్ యాదవ్, పాఠశాల హెడ్‌మాస్టర్, మండల విద్యాధికారి, వైద్య, విద్య అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి'

పెద్దబజార్, జూన్ 20: స్వామినాథన్ కమిషన్ సిఫారసులు వెంటనే అమలు చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి గాను 14 రకాల పంటలకు మద్దతు ధరతో రైతుకు నిరాశ మిగిల్చిందన్నారు. జూన్ 19న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ దేశంలో సాగు చేస్తున్న వంద పంటలకు 14 పంటలకు మాత్రమే మద్దతు ధర నామమాత్రంగా పెంచి ప్రకటిస్తున్న సందర్భంలో మోదీ రైతు పక్షపాతాన్ని రైతు ఆదాయాన్ని పెంచే విధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో, ప్రణాళికలో పేర్కొన్నట్లుగా ఈ మద్దతు ధర ప్రకటన నేపథ్యం లేదని నిరసన వ్యక్తం చేశారు. రైతుపెట్టుబడికి 50 శాతం కలిపి ధర నిర్ణయించి స్వామినాథన్ కమీషన్ సిఫారసును అమలు చేస్తామని రైతును రాజు చేస్తామని గొప్ప గొప్పలు చిలుక పలుకులు పలికి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ మంత్రులు రైతులు పండించిన వంద రకాలకు పైగా పంటలకు కేవలం 14 రకాల పంటలకు మాత్రమే ధర నిర్ణయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబన్న, దేవరాం, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నవీపేట,జూన్20: మండలంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన అయిటోళ్ల రాజు(30)అనే ఆటో డ్రైవర్ గురువారంపురుగుల మందును సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం గతంలో ఉపాధి నిమిత్తం రాజు గల్ఫ్ దేశం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చిన అతడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన రాజు గురువారం తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు సేవించగా వెంటనే అతనిని చికిత్స నిమిత్తం 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, 12సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వే పట్టాలపై పడేసిన ఆవును ఆసుపత్రికి తరలింపు

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: నగరంలోని మాదవనగర్ క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రైలు పట్టాలపై ఆవును పడేసిన విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆ ఆవును ఆసుపత్రికి తరలించారు. ఆవు రైలు పట్టాలపై పడి ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి ద్రాక్షిక రమేష్ తదితరులు ఆటో సహాయంతో కోటగల్లిలోని వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆవుకు చికిత్స అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

బడారామ్‌మఠ్ భూముల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: నగరంలోని బడారాం మఠ్‌కు చెందిన భూములను మోపాల్ మండలం ముదక్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 190లో రెండు ఎకరాల నాలుగు గుంటల వ్యవసాయ భూమిని దేవాదాయ శాఖ సిబ్బంది గురువారం పరిశీలించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల చేత ఇప్పటి వరకు కౌలు చేస్తున్న తూర్పునారాయణ అనే రైతును కలిసి కౌలు వివరాలు సేకరించారు. గ్రామాభివృద్ధి కమిటీ వారు ఈ భూమి కౌలును గ్రామాభివృద్ధికి ఇవ్వాలని బోరు వేయించి సౌకర్యం చేద్దామని 37 సంవత్సరాల నుంచి మార్కెట్ రేటుతో కౌలు రుసుము చెల్లించాలని వారి వద్ద వివరాలను ఫిట్‌పర్సన్ వేణుకు లేఖలు అందజేశారు. సిర్పూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 646లో ఉన్న నాలుగు గుంటలు, 647లో ఉన్న రెండు ఎకరాల విస్తీర్ణాన్ని సాగుచేస్తున్న వెల్మల్ సాయిరెడ్డికి వారు చెల్లించిన రసీదులు తీసుకొని వచ్చి వాటిని చూపించి తదుపరి ఈ సంవత్సరంకు కౌలు చెల్లించాలని సూచించారు. న్యాల్‌కల్ గ్రామంలోని 662 సర్వే నెంబర్‌లోగల ఒక ఎకరం 19 గుంటల భూమిని కౌలుచేస్తున్న పంతుల సునీతకు గతంలో కౌలు చెల్లించిన రసీదులను చూపించి బకాయిలు కూడా చెల్లించాలని అధికారులు తెలియజేశారు. మాక్లూర్ మండలం బోర్గాం(కె)లోగల 556 సర్వే నెంబర్‌లో ఉన్న రెండు ఎకరాల మూడు గుంటల భూమిని గ్రామస్తులచే కౌలు విషయం మాట్లాడినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

కన్నతండ్రిని చంపిన కొడుకుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

బోధన్‌రూరల్,జూన్20: మద్యం మత్తులో కన్నతండ్రిని చంపిన కొడుకుకు గురువారం బోధన్ కోర్టులో ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రవికుమార్ తీర్పు వెల్లడించారు. బోధన్ కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపిన వివరాల ప్రకారం వర్ని మండలానికి చెందిన కాకలదాస్ తండా గ్రామ పంచాయతీకి చెందిన మాలవత్ ధూప్యనాయక్ భార్య గబ్బుబాయ్‌లు ముగ్గురు సంతానం. గోపాల్, వినోద్, నవీన్ కలరు. వినోద్ అనే వ్యక్తికి 5సంవత్సరాల క్రితం సంకబాయితో పెళ్లి అయింది. వారికి ఇద్దరు కుమారులు ఇంటి పక్కనే రేకుల షెడ్డులో ఉంటారు. వినోద్ కొంతకాలంగా చుట్టు పక్కల గ్రామాలలో దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరికిపోయి జైలుకు పోయి వచ్చాడన్నారు. దొంగతనాలు చేయొద్దని చెప్తున్న తనభార్య సంకబాయితో నాన్నతో గొడవపడ్డాడు. ఈ మధ్యనే వినోద్ ఓ దొంగతనం కేసులో బాన్సువాడ పోలీసులు జైలుకు పంపగా వారంలోనే తిరిగి వచ్చాడని తెలిపారు. 3-6-2021నాడు సుమారు 10:20నిమిషాల్లో బాగా తాగి ఇంటికి వచ్చి తన గుడిసెలో తన భార్య సంకబాయి అనవసరంగా గొడవ పడి కర్రతో కొడుతున్న అది చూసి నాన్న ధూప్య అడ్డుకోగా నీకెందుకు అంటూ తన చేతిలో ఉన్న కర్రతో నాన్నను తలపై కొట్టగా తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. ఇట్టి విషయంలో మాలవత్ ధూప్యనాయక్ కుమారుడైన గోపాల్ 4-6-2021న వర్ని పోలీసులకు ఫిర్యాదుచేయడం వల్ల అప్పటి ఎస్ఐ అనిల్ రెడ్డి కేసు నమోదు చేసి ఇన్వెస్టిగేషన్ చేసి అశోక్‌రెడ్డి సీఐ చార్జిషీట్ వేయడం జరిగిందన్నారు. పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వాదించడం వల్ల గురువారం 5వ అదనపు జిల్లా సెషన్ జడ్జి రవికుమార్ ఐదేళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, వెయ్యిజరిమాన విధించారు. జరిమాన చెల్లించని పక్షంలో 18నెలల సాధారణ జైలు జీవితం అను భవించాల్సిందిగా తీర్పును వెల్లడించారు. కేసులో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, కృష్ణకుమార్, లింగంప్రసాద్ తదితరులున్నారు.

ఐక్యరాజ్యసమితి దళానికి ఎంపికైన ఏసీపీ కిరణ్

ఖిల్లా, జూన్ 20: ఐక్యరాజ్య సమితిలో పనిచేసేందుకు తెలంగాణకు చెందిన పోలీస్ అధికారులు 19 మంది ఎంపికయ్యారు. గతంలో జిల్లాలోని బోధన్ ఏసీపీగా పనిచేసిన కిరణ్‌కుమార్ కూడా వారిలో ఉన్నారు. జాతీయ స్థాయిలో ఢిల్లీలో ఈనెల 6 నుంచి 15 వరకు నిర్వహించిన పరీక్షలో రాష్ట్రానికి చెందిన ఈ అధికారులు ఎంపికయ్యారు. వీరు ఐక్యరాజ్యసమితి శాంతిదళంలో రెండేళ్లపాటు పనిచేయనున్నారు. బోధన్‌లో పనిచేసి ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన కిరణ్‌కుమార్ ఎంపిక కావడంతో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

ముప్కాల్, జూన్20: ఉమ్మడి బాల్కొండ మండలంలో ప్రైవేటు పాఠశాలలో పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను, యూనిఫాంలను, షూలను పాఠశాలలో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ప్రైవేటు యాజమాన్యాలను ఎంఈవో బట్టు రాజేశ్వర్ హెచ్చరించారు. ముందస్తు సమాచారం రావడంతో గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేసి అట్టి పుస్తక కేంద్రాన్ని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలకు వెళ్ళి సందర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన అన్నారు.

ముప్కాల్ ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాస్

ముప్కాల్, జూన్20: ముప్కాల్ గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రెంజర్ల గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను అదనపు బాధ్యతలుగా ముప్కాల్ ఇన్‌చార్జీ కార్యదర్శిగా నియమించారు. గతంలో ఇదే కార్యదర్శి సస్పెండ్ కావడంతో ఇతను తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించిన ఎస్సై

మోర్తాడ్, జూన్20: మండల కేంద్రంలోని బోగ రాముకు ఐఫోన గత ఆగస్టు నెలలో పడిపోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి పీసీఐఆర్ ప్రోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ కనుగొని గురువారం బాధితుడు రాముకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.లక్షా 10 వేల ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్, జూన్20: మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన లక్ష్మదీపక్‌కు ఆపరేషన్ నిమిత్తం రూ.లక్షా 10వేల ఎల్‌వోసీని గురువారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ అందజేశారు. బాధితుడు లక్ష్మదీపక్ సర్జరీ కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయమై సునీల్‌కుమార్‌ను సందర్శించగా సీఎం సహాయనిధి కింది వైద్యఖర్చుల కోసం రూ.లక్ష 10వేలు ఎల్‌వోసీని మంజూరు చేయించారు. గురువారం బాధిత కుటుంబసభ్యునికి అందజేశారు.

దత్తాపూర్ చెరువులో ప్రారంభమైన సర్వే

డొంకేశ్వర్, జూన్ 20: మండలంలోని దత్తాపూర్ చెరువులో ప్రారంభమైన సర్వే గ్రామస్థులు 485సర్వే నెంబర్‌లో 110ఎకరాల పే చెరువు విస్తీర్ణం ఉండగా క్రమేపి తగ్గిపోతుందని దత్తాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తహసీల్దార్ వెంకటరమణకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు చెరువులో సర్వేను మొదలుపెట్టారు. మొదటి రోజు కొంత వరకు సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన అనంతరం చెరువు హద్దులను గుర్తించి కబ్జాకు గురికాకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

'నికాల్‌పూర్‌కు బస్సు నడపాలి'

డొంకేశ్వర్, జూన్ 20: మండలంలోని నికాల్‌పూర్ గ్రామానికి బస్సును యధావిధిగా నడిపించాలని కోరుతూ గ్రామస్థులు గురువారం ఆర్మూర్ ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి బస్సు రాకపోవడం వల్ల ప్రజలు ప్రైవేటు వాహనాలలో వెళ్తున్నారని అన్నారు. గతంలో నడిపిన సమయానికి బస్సులను నడపాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సుమన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

మోదీ ప్రభావంతోనే రాజకీయాల్లోకి వచ్చా : ఎంపీ అర్వింద్

పెద్దబజార్, జూన్ 20: మోదీ ప్రభావంతోనే రాజకీయాల్లోకి వచ్చానని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ గురువారం ఓ వీడియో విడుదల చేశారు. ధర్మపురి అర్వింద్ డబ్బులు పంచారంటే ఎవరు కూడా నమ్మరని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజామాబాద్ నియోజకవర్గ ప్రజల మీద ప్రేమతో నిలబడలేదని అన్నారు. జగిత్యాలలో లక్ష ఓట్లు నిజామాబాద్‌లో 2లక్షల ఓట్లు మైనార్టీ ఓట్లు ఉన్నాయని వాటి కోసం పోటీచేశారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల మీద ప్రేమతో పోటీ చేయలేదన్నారు. విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విడ్డూరంగా మాట్లాడారని ఆయన ఎద్దేవ చేశారు. ప్రజలకు ఎంత చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మరని జిల్లా ప్రజలు లక్షా 30వేల ఓట్లతో బీజేపీని గెలిపించినందుకు పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఏకచక్రేశ్వరాలయ గోశాలకు రూ.5 లక్షల విరాళం

బోధన్‌రూరల్,జూన్20: పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయం శివాలయం వద్ద గల గోశాల రేకుల షెడ్డు నిర్మాణం కోసం బాలకృష్ణ, కమల్ కిషోర్ ఇనానిరూ.5లక్షల రూపాయల విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గోశాల కమిటీ నిర్వాహకులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఏకచక్రేశ్వరాలయ గోశాల కమిటీ తదితరులున్నారు.

'పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి'

డిచ్‌పల్లి,జూన్ 20: ఆరునెలలుగా గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనలు చెల్లించకుండా పంచాయతీ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని, కార్మికులు వెంటనే వేతనాలు చెల్లించాలని గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపిన అనంతరం ఎంపీడీవో కార్యాలయం సూపరిండెంట్ నివేదితకు వినతి పత్రం అందజేశారు.

మున్సిపల్ ట్రాక్టర్ కింద పడి కార్మికురాలి మృతి

● న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు

సుభాష్‌నగర్, జూన్ 20: రోజులాగే విధులు ముగించుకొని వస్తున్న లలిత అనే కార్మికురాలు ట్రాక్టర్ కిందపడి విగతజీవిగా మిగిలింది. కొన్ని సంవత్సరాలుగా నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ సపాయి కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న లలిత గురువారం ఉదయం శాంతినగర్ ఈద్గావద్ద నగర పాలక సంస్థ ట్రాక్టర్ కిందపడి మృతి చెందింది. మున్సిపల్ కార్మికురాలు లలిత నగరంలోని 300 క్వార్టర్స్‌లో సర్కిల్-5, డివిజన్ నెంబర్-11లో పనిచేస్తుంది. పని ముగించుకొని ఇంటికి వెళ్లడానికి 300 క్వార్టర్స్ నుం చి ప్రధాన రోడ్డు మీదకు రావడానికి ఎలాంటి వాహనాలు లేవు. దీంతో ట్రాక్టర్‌పైనే ప్రధాన రోడ్డుమీదకు వస్తానని డ్రైవర్‌కు చెప్పగా తన సీటుపక్కనే కూర్చోబెట్టుకు న్నాడు. శాంతినగర్ ఈద్గా వద్దకు రాగానే లలిత మొఖానికి కట్టుకున్న చున్నీ కిందికి వేలాడి, పక్కన ఉన్న టైరులో చిక్కుకుంది. దీంతో లలిత కిందపడగా ట్రాక్టర్ వెనక టైరు ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే లలిత మృతిచెం దింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురికి మతదేహాన్ని తరలించారు. లలితకు న్యాయం జరిగే వరకు మృతదేహానికి పోస్టుమార్టం చేయనివ్వమని బంధువులు అడ్డుకున్నారు. ఇన్సూరెన్స్ లేకుండానే ట్రాక్టర్‌ను నగరపాలక సంస్థలో నడిపిస్తున్నారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, ఇన్‌సెట్‌లో మృతురాలు

న్యాయం చేయాలి...

ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన లలిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నగర పాలకసంస్థ కమిషనర్ మందమకరందీను కలిసి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లలిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వా లని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఇన్సూరెన్స్ బెనిఫిట్స్‌లను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, నర్సింగ్‌రావు, సందీప్, లలిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శాఖాపూర్ పంప్‌హౌస్ మరమ్మతులు పూర్తిచేయండి

● అధికారులను ఆదేశించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,జూన్20: మండలంలోని సిరన్‌పల్లి సమీపంలో ఉన్న శాఖాపూర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పంప్‌హౌస్ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం శాఖాపూర్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను పరిశీలించారు. పంప్‌హౌస్‌లో ఉన్న చిన్నచిన్న మరమ్మతు పనులను పూర్తిచేసి వానాకాలం సీజన్‌కు సంబంధించి సాగునీటి విడుదలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం శాఖాపూర్ సమీపంలో ఉన్న డీ50/17 ఉపకాలువను పరిశీలించారు. కాలువలో పూడికను తొలగించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువను ఆధునీకరించి ఆయకట్టుకు సాగునీరు అందించాలని అన్నారు. రోడ్లపై కేజీవీల్స్ తిప్పితే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేయాలని ఎస్ఐ యాదగిరిగౌడ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ బద్రి నారాయణ, డీఈ బలరాం, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, రాంచందర్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాలరాజు గౌడ్, కిరణ్, బాబు, విజయ్, బుచ్చన్న తదితరులున్నారు.


ఉప కాలువను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే

కొమురం భీంను స్ఫూర్తిగా తీసుకోవాలి

● విగ్రహ ఆవిష్కరణలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

డొంకేశ్వర్, జూన్ 20:నిజాం సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గొప్ప యోధుడైన కొమురం భీమ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్మూర్‌ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలో కొమురంభీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రాజ్యానితో పోరాడిన గొప్పవీరుడని అన్నారు. 1940 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడుగడుగున గిరిజనులపై అత్యాచారాలు, హత్యలు చేసిన సమయంలో ఒక్కడు పుట్టాడు. అతడే కొమురం భీం అన్నారు. అంత పెద్ద నిజాం సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గొప్పయోధుడని గుర్తుచేశారు. పేదలహక్కుల గురించి జల్‌జంగిల్ అనే నినాదంతో ఉద్యమించి వీర మరణం పొందాడని కొనియాడారు. కొమురంభీం ఆదివాసి ఆత్మగౌరవ ప్రతికగా ఆయన అన్నారు. 80ఏళ్ళ తర్వాత కూడా కొమురం భీం కోరుకున్నట్టు గిరిజనులకు అభివృద్ధి జరగలేదని పోడు పట్టాలు గురించి ఇక్కడ అక్కడ పోరాటాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్, ప్రధానకార్యదర్శి గంగాసాయిలు, డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, హనుమంతు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మూడవసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా రైతులకు 14రకాల వ్యవసాయ ఉత్పత్తులపై మద్దతుధర పెంచినందుకు గాను డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మారంపల్లి బైపాస్ రోడ్డును ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, సురకంటి శ్రీనివాస, గచ్చకాయల రవి, కల్లెడ నర్సారెడ్డి, సంతోష్‌బాబు, గంగాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వాలని ధర్నా

కోటగిరి,జూన్20: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులతో కలిసి కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలలుగా వేతనాలు లేకపోవడంతో కార్మికులు పస్తులు ఉంటున్నారని మండిపడ్డారు. గత్యంతరం లేక ధర్నా చేయాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. కార్మికులు ఎంపీడీవో చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న ఎంపీడీవో మనోహర్ రెడ్డి కార్యాలయానికి చేరుకుని కార్మికులతో మాట్లాడారు. రెండు నెలల బకాయి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పోశెట్టి, సాయవ్వ, బ్రహ్మం, లక్ష్మి, మక్కవ్వ, లక్ష్మణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీయూ పరీక్షలకు వన్‌టైం చాన్స్ షెడ్యూల్ విడుదల

డిచ్‌పల్లి,జూన్ 20: తెలంగాణ వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, కోర్సులు 2016, 17,18 సంవత్సరాల్లో పూర్తిచేసి ఉత్తీర్ణత సాధించలేని 1,2,3,4,5,6వ సెమిస్టర్ విద్యార్థులకు వన్‌టైం బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై 2నుంచి ప్రారంభమవుతున్నట్లు ప్రొఫెసర్ అరుణ తెలిపారు. టైంటేబుల్ వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

'నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోండి'

రెంజల్,జూన్20: మండంలోని బోర్గాం గ్రామానికి చెందిన రైతులకు నకిలీ విత్తనాలు అందించిన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు వ్యవసాయ అధికారి లక్ష్మికాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 15వ తేదీన సీడ్స్ షాప్ నుంచి బీపీటీ 5204వరి విత్తనాలను కొనుగోలు చేశామని, అందులో ఎక్కువ మొత్తంలో విత్తనాలు మొలకెత్తలేదని అన్నారు. ఇట్టి నకిలీ విత్తనాలను అందించిన సదరు ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ లేబుల్ లేకుండానే విత్తనాలను రైతులకు అందజేస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రమేష్, భూమారెడ్డి తదితరులున్నారు.

జాన్కంపేట చెరువులో పడి వ్యక్తి మృతి

ఎడపల్లి, జూన్ 20: మండలంలోని జాన్కంపేట గ్రామ శివారులో గల అశోక్‌సాగర్ చెరువులో పడి వ్యక్తి మృతిచెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన బోగేవార్ రమేష్ (35) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో కలత చెంది జానకంపేట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని, మృతదేహాన్ని చెరువులో నుండి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించి, కుటుంభసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

బోధన్‌రూరల్,జూన్20: మండలంలోని భూలక్ష్మిక్యాంప్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అర్థరాత్రి చోరీ జరిగినట్లు అంగన్‌వాడీ టీచర్ శిరీష పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భవతులు, బాలింతలకు ఇచ్చే బియ్యం, పప్పు, గుడ్లు, వంట సామాన్లు, గ్యాస్ సిలిండర్‌లు గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని ఆమె ఫిర్యాదులో పేర్కొనట్లు రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని, అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరలోనే దొంగను పట్టుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో ఏఈ మృతి

బోధన్‌రూరల్,జూన్20: బోధన్ పట్టణంలోని ఆటోనగర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో బోధన్‌రూరల్ ట్రాన్స్‌కో ఏఈ రవి చంద్ర మృతిచెందారు. ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, జూన్20: మున్సిపల్ పరిధిలోని ప్రధాన రోడ్లకు ఇరువైపుల పలు దుకాణాల్లో గురువారం మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్‌ల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. పలు షాపులలో పట్టుబడిన ప్లాస్టిక్‌ను సీజ్ చేసి జరిమానాలు విధించారు. సానిటరి ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడ్డ కుక్కను కాపాడిన యువకులు


కుక్కను కాపాడిన యువకుడు

నవీపేట,జూన్20: మండలంలోని రాంపూర్‌లో పాడుపడి ఉన్న బావిలో పడిపోయిన కుక్కను స్థానిక యువకులు కాపాడారు. మూడు రోజుల క్రితం కుక్క బావిలో పడిపోయింది. కుక్క అరుపులు విన్న స్థానిక యువకులు ఈర్నాల సాయిరాం, ఎర్రోల్ల గంగాధర్‌లు ధైర్యం చేసి నిచ్చెన సాయంతో బావిలో దిగారు. అనంతరం కుక్కను తాళ్లతో కట్టి పైకి తీసుకువచ్చారు. మూడు రోజులుగా ఆహారం, నీరు లేకపోవడంతో కుక్క నీరసించిపోయింది. కుక్కను ప్రాణాలతో కాపాడిన యువకులను గ్రామస్థులు అభినందించారు.

ఎంఎస్ఆర్ బార్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

సుభాష్‌నగర్, జూన్ 20: నగరంలోని వినాయక్‌నగర్‌లోగల ఎంఎస్ఆర్ బార్‌పై ఆహార కల్తీ నియంత్రణ అధికారి తారానాయక్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. బార్‌లో ఆహార కల్తీ జరుగుతున్న ఫిర్యాదులతో ఉదయం నుంచి బార్‌లో తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన మాంసాన్ని చెత్త బుట్టలో పారేశారు. అంతేకాకుండా ఆహార పదార్థాల్లో కలుపుతున్న పదార్థాల సాంపిల్‌ను సేకరించి రాష్ట్ర ఆహార కల్తీ నియంత్రణ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. జిల్లాలో హోటళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కల్తీ జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దేవాదాయ శాఖ భూముల పరిశీలన

మోపాల్, జూన్ 20: మండలంలోని ముదక్‌పల్లి, న్యాల్‌కల్, సిర్పూర్ గ్రామాల్లో ఉన్న పెద్ద రాంమందిర్ భూములను ఎక్కడ ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు గురువారం దేవాదాయ శాఖ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి పరిశీలించారు. అయా గ్రామాల్లో ఉన్న దేవాదాయ శాఖ భూములను కొంత మంది వాడుకుంటున్నారని తెలిపారు. ఇకనుండి ఈ భూములు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉంటాయని భూములను కౌలు చేస్తున్న రైతులకు అధికారులు వివరించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి అయా గ్రామాల్లో దేవాదాయ శాఖ భూములను తమ భూములుగా రైతులు గ్రామాల్లో వాడుకుంటున్నారని ఇప్పటి నుంచి తాము స్వాధీనం చేసుకుంటున్నామని అన్నారు. ఎవరైనా ఈ భూములను కొనాలనుకుంటే ప్రభుత్వ నిర్ణయం ప్రకారం డబ్బులు చెల్లించి తీసుకోవాలని తెలిపారు. రేట్ల వివరాలు ఉన్నతాధికారులను సంప్రదించిన తర్వాత వివరిస్తామని అయా గ్రామాల రైతులకు తెలిపారు.

'పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలు పరిష్కరించాలి'

నవీపేట,జూన్20: పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ కోరారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణికి సంబంధించిన అన్న రకాల సమస్యలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

సుభాష్‌నగర్, జూన్ 20:పైసా ఖర్చు లేకుండా యోగా ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని రిటైర్డ్ పోలీసుఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం భారతదేశానికి గర్వకారణమన్నారు. మనిషి నిత్య జీవనంలో యోగా ఒక భాగం కావాలన్నారు. పురాతన కాలం నాటి యోగాను నేడు ప్రపంచ దేశాలు అవలంబిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్, ప్రభాకర్, కిషన్, బాలశేఖర్, బంటు సంతోష్, భూమాగౌడ్, గంగాధర్, జలేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ'

డిచ్‌పల్లి,జూన్ 20: మండలంలోని అన్ని గ్రామాల మౌలిక సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మండల పరిషత్ అధ్యక్షుడు చిన్నోళ్ల నర్సయ్య అన్నారు. మండలంలోని ముల్లంగి గ్రామ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు వీడీసీ సభ్యులు కలిసి గురు వారం ఎంపీపీని సన్మానించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తానని అన్నారు. ఎంపీపీని సన్మానించిన వారిలో సంఘం ప్రతినిధులు నరేశ్, రాజు, శ్రీనివాస్, లక్ష్మయ్య, నారాయణ, సుమన్, గంగారెడ్డి, నరేందర్, సతీశ్, శేఖర్, రవి, వీడీసీ అధ్యక్షుడు భూపతి, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

నవీపేట,జూన్20: మండలంలోని కమలాపూర్‌లోని అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో బుధవారం అర్థరాత్రి చోరీకి విఫలయత్నం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం స్థానిక అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయం తాళాన్ని గుర్తుతెలియని దొంగ పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ముఖానికి కర్చీఫ్, చేతులకు గ్లౌజ్‌లు వేసుకుని ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను తీయడానికి యత్నించి విఫలమయ్యారు. చోరీకి వచ్చిన వ్యక్తి ఆనవాళ్లు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. అలాగే నవీపేటలోని ప్రధాన రహదారిపై ఉన్న ఒక కిరాణ షాపు తాళాలను సైతం బుధవారం అర్థరాత్రి పగుల గొట్టి చోరీకి విఫలయత్నం చేశారు.

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్‌లకు స్లాట్ బుకింగ్ ప్రారంభం

కోటగిరి,జూన్20: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ ఇంజనీరింగ్, డిప్లామా కోర్సులలో అడ్మిషన్‌ల కోసం ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ కొరకు స్లాట్ బుకింగ్ ప్రారంభమైందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీరఅర్జున్ తెలిపారు. పాలిసెట్ 2024 పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకుని నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 22నుంచి 25వ తేదీ వరకు జరిగే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హజరుకావచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్ పెట్టుకోవడానికి కోటగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73000	రూ.67,300	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1: మహారాజ (11.05, 4.30, 7.35, 10.40)
: మరణం (2.10)
: మహారాజ (4.20)
స్ర్కీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.30, 5.05) ఏ (1.50)
: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ(7.25)
: ముంజియా (హిందీ) (10.35)
స్ర్కీన్-3 : ఓ మంచి గోస్ట్ (11.15, 7.55)
: హనిమూన్ ఎక్స్‌ప్రెస్ (2.00)
: హరోం హర (4.40)
: చందూ చాంపియన్(హిందీ) (10.40)
స్ర్కీన్-4 : ఇట్లు మీ సినిమా (11.45)
: నిందా (2.20, 7.50, 10.30)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : మహారాజ (1.45, 4.40, 7.35, 10.30)
స్ర్కీన్-2 : ఓ మంచి గోస్ట్ (11.10, 4.35)
ప్రభుత్వ జూనియర్ కళాశాల (1.40)
నిందా (7.30, 10.25)
స్ర్కీన్-3 : హనీమూన్ ఎక్స్‌ప్రెస్ (1.45) : మనమే (4.40, 10.30)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చందు చాంపియన్ (11.15, 2.15, 6.15,9.15)
విజయ్ : నిందా (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్